ప్రజాశక్తి
బుధవారం 13 సెప్టెంబరు 2023

త్వరితగతిన ఓటర్ల ప్రక్రియ పూర్తి

శ్రీకాకుళం : జిల్లాలో చేపడుతున్న సంక్షిప్త ఓటర్ల జాబితా కార్యక్రమం త్వరితగతిన పూర్తి కావాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. ఇందులో అలసత్వం వద్దన్నారు. ఓటర్ల మార్పులు, చేర్పులు, తొలగింపులు తదితర వివరాలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఫారం-8కు సంబంధించిన వివరాలను సేకరించి మూడు నెలలైనా కొందరు అధికారులు పూర్తి చేయకపోవడంపై ఆరా తీశారు. ఓటర్ల వివరాల సేకరణకు ఇంకా వారం రోజులు మాత్రమే గడువు ఉన్నందున ఈలోగా ప్రక్రియ పూర్తి కావాలని ఆదేశించారు. ఈ ప్రక్రియను పూర్తి చేయడంలో అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని ఇఆర్ఓ, ఎఇఆర్ఓలను హెచ్చరించారు. కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కరువు సమీక్షకు తీరిక లేదా?

- వర్షాభావంతో వేలాది ఎకరాల్లో పంటలు వేయని రైతులు
- సాగు నీరు కోసం అవస్థలు
- తీరిక లేని రెవెన్యూ మంత్రి ధర్మాన
- పలాస తప్ప జిల్లా సమస్యలు పట్టని మంత్రి అప్పలరాజు

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. అధిక శాతం మండలాల్లో సాధారణ వర్షపాతమే నమోదైంది. ఆరు మండలాల్లో కరువుఛాయలు కమ్ముకుంటున్నాయి. వేలాది ఎకరాల్లో నేటికీ విత్తనాలు వేయలేని పరిస్థితులున్నాయి. కొన్ని ప్రాంతాల్లో భూగర్భ జలాలు సైతం అడుగంటుతుండటంతో చెరువులు ఎండిపోతున్నాయి. దీంతో ఎండిపోతున్న పంటలను తడుపుకునే అవకాశం లేకుండా పోతోంది. మరోవైపు వంశధారలో నీరు పుష్కలంగా ఉన్నా, కాలువల్లో గుర్రపుడెక్క పేరుకుపోవడం, షట్టర్లు లేకపోవడంతో శివారు భూములకు సాగునీరందడం లేదు. ఈ పరిస్థితుల నుంచి ఎలా గట్టెక్కాలో తెలియక రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలో కరువు పరిస్థితులు నెలకొన్నా సమీక్షించి, ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టేందుకు అమాత్యులకు తీరిక లేకుండా పోయింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో అన్నిరకాల పంటలు కలిపి 4,37,165 ఎకరాల సాగు లక్ష్యంగా నిర్ధేశించుకోగా 3,67,531 ఎకరాల్లో (84 శాతం) పంటలు వేశారు. వరి పంటను 3,98,750 ఎకరాల్లో వేస్తారని అంచనా వేయగా, ఇప్పటివరకు 3,39,468 ఎకరాల్లో (85 శాతం) సాగైంది. జిల్లాలో ఇప్పటివరకు కురిసిన వర్షపాతం మేరకు ఆరు మండలాల్లో కరువుఛాయలు అలుముకున్నాయి. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో నాలుగు, పలాస, ఎచ్చెర్ల మండలాల్లో చెరొక మండలాలు ఉన్నాయి. వాటిలో కవిటి, ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట, నందిగాం, జి.సిగడాం మండలాలు తీవ్ర వర్షపాతం లోటును ఎదుర్కొంటున్నాయి. జిల్లాలో ఇప్పటివరకు సుమారు 70 వేల ఎకరాల్లో పంటలు సాగు కాలేదని వ్యవసాయశాఖ నివేదికలు చెప్తున్నాయని. అందులో వరి పంటే 59 వేల ఎకరాలకు పైగా ఉంది. పంటలు సాగైనట్లు లెక్కలు చెప్తున్నా, కొన్నిచోట్ల ఎండిపోతున్నాయి.

బూర్జ మండలం అల్లెనలో ఇంజిన్‌తో వరి పంటకు నీరు పెడుతున్న రైతులు

సాగునీరందక రైతుల అవస్థలు

వర్షాధారంపై ఆధారపడిన మెట్ట ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులే సాగునీటి కాలువ కింద ఉన్న ప్రాంతాల్లోనూ ఉన్నాయి. ఒడిశాలో కాస్తాకూస్తో వర్షాలు పడుతుండడంతో హిరమండలం గొట్టాబ్యారేజీలో తగినంత నీటి నిల్వలు ఉండనే ఉన్నాయి. కాలువల్లోకి నీటిని విడిచిపెడుతున్నా అవి శివారు భూములను చేరడం లేదు. కాలువల్లో పెద్దఎత్తున పూడిక, గుర్రపుడెక్క పేరుకుపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. వర్షాల్లేక ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు నానా పాట్లు పడుతున్నారు. ఇంజిన్లు పెట్టుకుని పొలాలను తడుపుకుంటున్నారు. కొన్నిచోట్ల ఆ అవకాశమూ లేకుండా పోయింది. వర్షాభావ పరిస్థితులతో పలు మండలాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో చెరువులు ఎండిపోయాయి.

తీరిక లేని రెవెన్యూ మంత్రి ధర్మాన

జిల్లాలో క్రమేణా కరువు ఛాయలు అలుముకుంటుండడంతో ఏం చేయలో రైతులకు పాలుపోవడం లేదు. వ్యవసాయం, సాగునీటిపై చర్చించి రైతులకు భరోసా కల్పించాల్సిన జిల్లాకు చెందిన ఇరువురు మంత్రులూ తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు అరెస్టుపై పోటీ పడి ప్రెస్‌మీట్లకు సమయం కేటాయిస్తున్న అమాత్యులు కరువు పరిస్థితులపై సమీక్షకు తీరిక లేకుండా పోయింది. ఈనెల ఎనిమిదో తేదీన జిల్లా నీటిపారుదల సలహా మండలి, వ్యవసాయ సలహా మండలి సమావేశానికి హాజరు కానున్నట్లు తొలుత అధికారులకు చెప్పిన రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు తర్వాత సమావేశానికి డుమ్మా కొట్టారు.

ఆ రోజు గారలో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం, తర్వాత అదే రోజు శ్రీకాకుళం నగరంలో కొత్తగా నిర్మించిన ఓ ప్రయివేట్ ఆస్పత్రి ప్రారంభానికి సమయం వెచ్చించిన మంత్రి, రైతాంగ సమస్యలపై నిర్వహించిన సమావేశానికి మాత్రం హాజరు కాలేదు. రెవెన్యూతో పాటు కరువు, విపత్తులను చూస్తున్న మంత్రి ధర్మాన హాజరైతే, జిల్లాలో ఉన్న పరిస్థితులు అర్థమై ఏం చేయాలో అధికారులకు ప్రత్యామ్నాయ చర్యలు సూచించే అవకాశం ఉండేది. కరువును ఎదుర్కోవడం, రైతులను ఆదుకోవడం వంటి అంశాలు చర్చకు వచ్చి ఒక పరిష్కారం దొరికేది. మంత్రి ధర్మాన గైర్హాజరు కావడంతో ఆ సమావేశం మొక్కుబడిగానే సాగింది. ఇప్పటికైనా వ్యవసాయ పరిస్థితులను సమీక్షిస్తే రైతులకు కొంతవరకైనా మేలు చేకూరుతుంది.

జిల్లా సమస్యలు పట్టని మంత్రి అప్పలరాజు

వ్యవసాయ సలహా మండలి సమావేశానికి పశు సంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు హాజరైనా పలాస నియోజకవర్గ దృష్టితోనే మాట్లాడారు తప్ప జిల్లా పరిస్థితులకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వలేదు. తోటపల్లి, నారాయణపురం అంశాలు, అక్కడి రైతులతో తనకు సంబంధం లేనట్లుగా వ్యవహరించారు. షట్టర్ల సమస్య వల్లే వంశధార కాలువల ద్వారా శివారు భూములకు నీరు ఇవ్వలేకపోతున్నామని ఇంజినీరింగ్ అధికారులు దృష్టికి తీసుకువెళ్లడంతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఖరీఫ్ ప్రారంభానికి ముందే షట్టర్ల సమస్యపై అధికారులతో మాట్లాడి ఉంటే వంశధార ఆయకట్టు భూములు ఎండిపోయే పరిస్థితి వచ్చేది కాదు. షట్టర్ల సమస్య కంటే వర్షాభావ పరిస్థితులతో పంటలు వేయలేకపోయిన, వేసిన పంటలు ఎండిపోయి నష్టపోతున్న రైతులను ఏవిధంగా ఆదుకోవాలన్న అంశాలపై తొలుత ప్రాధాన్యం ఇస్తే రైతులకు కొంతైనా మేలు చేకూరుతుందనే అభిప్రాయం వినిపిస్తోంది.

టిడిపి నాయకులు, పోలీసుల మధ్య తోపులాట

ఉద్రిక్తత

- ర్యాలీని పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట
- టిడిపి కార్యాలయం ముందు నాయకుల బైఠాయింపు
- పలువురు అరెస్టు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయం వద్ద మంగళవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ నల్లజెండాలతో నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయం నుంచి అరసవల్లి కూడలి వరకు ప్రదర్శనగా ఆ పార్టీ నాయకులు బయలుదేరారు. ర్యాలీకి అనుమతి లేదని పోలీసులు అడ్డుకోవడంతో టిడిపి నాయకులు, పోలీసుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. పోలీసులను నెట్టుకుంటూ టిడిపి నాయకులు ముందుకు వెళ్లే క్రమంలో వారి మధ్య తోపులాట చోటుచేసుకుంది. దీంతో టిడిపి నాయకులు, కార్యకర్తలు పార్టీ కార్యాలయం ముందు బైఠాయించారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్‌కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్, ఎమ్మెల్యే బెందాళం అశోక్, మాజీ ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, కలమట వెంకటరమణ, గుండ లక్ష్మీదేవి తదితరులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

జగన్ నియంతృత్వ పోకడలను తిప్పికొట్టాలి

రాష్ట్రంలో జగన్ నియంతలా పాలన సాగిస్తున్నారని, ఈ పాలనకు వ్యతిరేకంగా పోరాడాలని టిడిపి జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబుకు అండగా ప్రతి కార్యకర్తా నిలవాలన్నారు. రాష్ట్రంలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ద్వారా టిడిపి ప్రభుత్వ కాలంలో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు పెద్దఎత్తున కల్పించామని, ఈ కేంద్రాలకు కేటాయించిన నిధులు సంబంధిత అధికారుల పర్యవేక్షణలో విడుదల చేశామన్నారు. ఈ వ్యవహారంలో నాటి అధికారులు, ప్రస్తుత ప్రభుత్వంలో సలహాదారులుగా ఉన్నారన్నారు. వారిని ప్రశ్నించకుండా చంద్రబాబును ఎలా అరెస్టు చేస్తారని ప్రశ్నించారు. అవినీతిపరుడైన జగన్, అందరిపైనా ఆ మచ్చ వేయాలని చూస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్, మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, గుండ లక్ష్మీదేవి, కలమట వెంకటరమణ, జెడ్‌పి మాజీ ఛైర్‌పర్సన్ చౌదరి ధనలక్ష్మి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలి
- కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, గ్రామ, వార్డు సచివాలయ అధికారులు, ఎంఇఒలకు నిర్దేశించిన లక్ష్యాలను రెండు రోజుల్లోగా సాధించాలని, లేకుంటే చర్యలు తప్పవని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ హెచ్చరించారు. సంబంధిత అధికారులతో కలెక్టరేట్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో చేపడుతున్న ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో కొన్ని కార్యక్రమాలు బాగానే నడుస్తున్నా, మరికొన్ని పథకాలు వెనుకంజలో ఉన్నాయన్నారు. అటువంటి వాటిపై ఎంపిడిఒలు, సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. పేదలందరికీ ఇళ్లు కార్యక్రమం జిల్లాలో బాగానే జరుగుతున్నా, ఇంకా నాలుగు శాతం పనులు ప్రారంభం కావాల్సి ఉందన్నారు. వాటిని రానున్న రెండు రోజుల్లోగా ప్రారంభించాలని, ప్రగతి కనబరచని మండలాల అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో 36వేల గృహాలు పూర్తి కాగా, పూర్తయిన గృహాలకు చెల్లింపులు చేయాల్సి ఉందన్నారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్లు పూర్తి కావాలని, అవి పూర్తయితే స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ నుంచి రూ.12 వేలు లబ్ధిదారునికి అందుతుందని స్పష్టం చేశారు.

గడప గడపకు మన ప్రభుత్వం (జిజిఎంపి) కార్యక్రమం కింద 2,407 పనులకు అనుమతులు మంజూరు చేశామని, అందులో కొన్ని పనులు ప్రారంభం కాలేదన్నారు. ఇప్పటివరకు పూర్తయిన 2099 పనులకు గానూ కొందరు బిల్లులను అప్‌లోడ్ చేయలేదని, చేసిన వెంటనే నిధులు మంజూరవుతాయని తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఈనెల 30 నుంచి ప్రారంభం కానుందన్నారు. 594 సచివాలయాలతో పాటు 13 పట్టణ ఆరోగ్య కేంద్రాలకు మ్యాపింగ్ చేయనున్నట్లు చెప్పారు. ఈ పథకం కింద ఇంటింటికీ వాలంటీరు వెళ్లి ఆ కుటుంబంలోని ఆరోగ్య సమస్యలపై వివరాలు సేకరించి టోకెన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. తద్వారా గ్రామంలో నిర్వహించే ఆరోగ్య శిబిరం వద్ద అన్ని వైద్య పరీక్షలు, మందులు ఉచితంగా పొందవచ్చన్నారు. గ్రామంలో నిర్వహించే వైద్య శిబిరం తేదీపై ముందుగా అందరికీ తెలిసేలా ప్రచారం చేయాలని సూచించారు. ప్రతి శిబిరంలో ఇద్దరు వైద్యులు, స్పెషలిస్టు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. గ్రామంలో ఉండే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని కార్యక్రమాలకు అంతరాయం ఉండరాదన్నారు. జిల్లాలో గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో 187 సచివాలయాల్లో పూర్తయిందని, ఇంకా 562 సచివాలయాల్లో పూర్తి చేయాల్సి ఉందన్నారు. రెండు రోజుల్లోగా వీటిని పూర్తి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో ఎనిమిది స్థిరమైన లక్ష్యాలను నిర్దేశించడమైందని, వాటిపై వాటిపై అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని చెప్పారు. సమావేశంలో గృహనిర్మాణ సంస్థ పథక సంచాలకులు ఎన్.గణపతి, ముఖ్య ప్రణాళిక అధికారి వి.ఎస్.ఎస్.ఎల్ ప్రసన్న, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, సమగ్ర శిక్ష ఎపిసి ఆర్.జయప్రకాష్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

సాధనతో ఉన్నత శిఖరాలు

- జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్
- ఉత్సాహంగా యువజనోత్సవాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

సాధన ద్వారా యువత ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. సృజనాత్మకతను వెలికితీసేందుకు యువజనోత్సవాలు దోహదపడతాయని తెలిపారు. నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సెట్‌శ్రీ ఆధ్వర్యాన జిల్లాస్థాయి యువజనోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం ప్రారంభమైన వేడుకల్లో యువతీ యువకులు పలు నృత్యాలను ప్రదర్శించారు. ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం జెసి మాట్లాడుతూ యువత మంచి మార్గం వైపు పయనించి పోటీలో నిలదొక్కుకోవాలన్నారు. ప్రతి వ్యక్తి పుట్టుకతో గొప్పవారు కాలేరని, వారి శ్రమ, పట్టుదల, దీక్ష వారిని ఉన్నత స్థితికి చేరుస్తాయన్నారు. వ్యక్తిత్వ వికాసానికి యువజనోత్సవాలు దోహదపడతాయన్నారు. స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని ధృఢమైన సంకల్పం క్రమ శిక్షణతో మెలగాలన్నారు. ఆయన బోధనలను నిరంతరం చదువుతూ వాటిని అలవాట్లుగా మార్చు కోవాలన్నారు. గత ఏడాది జిల్లా నుంచి ఎంపికైన బృందాలు జాతీయ స్థాయిలో ప్రదర్శనలు ఇచ్చి అందర్నీ ఆకట్టుకున్నారని గుర్తు చేశారు. ఈ ఏడాది కూడా యువజనోత్సవాల్లో శ్రీకాకుళం జిల్లా నుంచి రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం ఉండాలన్నారు. జాతీయ యువజనోత్సవాలలో జిల్లా యువత ప్రతిభ చూపాలన్నారు. యువతకు అనేక రకాలైన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు తెలిపారు. కార్యక్రమంలో మెప్మా పీడీ ఎం.కిరణ్‌కుమార్, వయోజన విద్య ఉప సంచాలకులు ఎం.వెంకటరమణ, ఉపాధి కల్పనాధికారి సుధ, ఇంటెక్ సభ్యులు రాధా ప్రసాద్, ఎన్‌వైకె కోఆర్డినేటర్ వెంకట్ ఉజ్వల్, జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు, మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవీన్

అవగాహనతో కేన్సర్‌కు అడ్డుకట్ట

మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి ఆంకాలజీ ప్రొ.మురళీకృష్ణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అవగాహనతోనే కేన్సర్ వ్యాధిని ప్రాథమిక స్థాయిలో గుర్తించవచ్చని మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి, రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సర్జికల్ అంకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ వి.మురళీకృష్ణ అన్నారు. నగరంలోని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు కేన్సర్‌పై రెండు రోజుల అవగాహన కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిహెచ్‌సి వైద్యాధికారులు కేన్సర్‌పై గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలకు అవగాహన లేకపోవడం వల్ల సకాలంలో వైద్యం పొందలేక ప్రాణాపాయానికి గురవుతున్నారని తెలిపారు. కేన్సర్ వ్యాధిగ్రస్తులను ప్రాథమిక స్థాయిలోనే గుర్తించి, అనుమానాస్పద కేసులను ప్రతి సోమవారం రిమ్స్ ఆస్పత్రికి పంపించాలన్నారు. మహాత్మాగాంధీ కేన్సర్ ఆస్పత్రి వైద్యులు పి.వెంకటకృష్ణారెడ్డి ఆధ్వర్యాన నాలుగు కౌంటర్ (సర్జికల్ ఒపి) నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా నోటి, లంగ్, గర్భాశయ, బోన్ కేన్సర్లను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స చేయవచ్చని చెప్పారు. సదస్సులో జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి, ఎడిఎంహెచ్ఒ అనురాధ, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ పి.ప్రకాశరావు, జిల్లా మాస్ మీడియా అధికారి పి.వి రమణ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే టిడ్కో ఇళ్లు అందజేత

ఆమదాలవలస : మండలంలోని జగ్గుశాస్త్రులపేట వద్ద నిర్మాణంలో ఉన్న 528 ఎపి టిడ్కో ఇళ్లను త్వరలోనే లబ్ధిదారులకు అందించేందుకు చర్యలు చేపడుతున్నట్లు మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక పట్టణ మహిళా సామాజిక వనరుల కేంద్రంలో మెప్మా సిబ్బంది, వార్డు సచివాలయ ఇంజనీరింగ్ కార్యదర్శులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శాసన సభాపతి తమ్మినేని సీతారాం ఆదేశాలలో భాగంగా రానున్న అక్టోబర్ నెలాఖరు నాటికి పనులు పూర్తి చేసేలా టిడ్కో అధికారులు చర్యలు ప్రారంభించారని చెప్పారు. ఇందులో భాగంగానే డిసెంబరు నాటికి పూర్తిస్థాయిలో గృహాలను లబ్ధిదారులకు అందించనున్నట్లు వివరించారు. 365, 430 చదరపు అడుగుల ఇళ్లు పొందిన లబ్ధిదారులు నిబంధనల మేరకు బ్యాంకు రుణం ఒప్పందం తక్షణమే చేయాలని, లేదా ఆ మేరకు వారే నగదును టిడ్కోకు చెల్లించాల్సి ఉంటుందన్నారు.సమీక్షలో హౌసింగ్ ఎఇ డి.సన్యాసిరావు, మెప్మా సిబ్బంది బి.రామారావు, వి.విజయకుమారి, స్థానిక సిబ్బంది, పట్టణ, స్లం సమాఖ్యల ఆర్పీలు పాల్గొన్నారు.

సగటు కూలి పెంపులో నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

ఉపాధి హామీ సగటు కూలి పెంపులో నిర్లక్ష్య ధోరణి సరికాదని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక సంచాలకులు జి.వి చిట్టిరాజు అన్నారు. కొన్ని పంచాయతీల్లో సగటు కూలి చాలా తక్కువగా ఉందని, ఈ ధోరణి మారకుంటే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక ఎన్ఆర్ఇజిఎ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదికను మంగళవారం నిర్వహించారు. మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరానికి గానూ నిర్వహించిన తనిఖీల నివేదికలను సామాజిక తనిఖీ డిఆర్‌పిలు చదివి వినిపించారు. వేతనాల రూపంలో రూ.9.50 కోట్లు, మెటీరియల్ కాంపోనెంట్ నిమిత్తం రూ.3.19 కోట్లు వెరసి రూ.12.69 కోట్లు మండలంలో ఖర్చు చేసినట్లు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో ప్లాంటేషన్ పనుల్లో భాగంగా నాటిన మొక్కలు కొంతమేర లేవన్నారు. కేరాసింగి, సుందరాడ, పెద్దపద్మాపురం, జోడూరు, మర్రిపాడు (సి) పంచాయతీల్లో ఎం.బుక్‌ల్లో వ్యత్యాసాలను గుర్తించారు. అనంతరం పీడీ మాట్లాడుతూ సామాజిక తనిఖీ నివేదికలపై విచారణ చేసి నిధులు రికవరీ చేయడంతోపాటు అవసరమైతే చర్యలు కూడా తీసుకుంటామన్నారు. మస్టర్ షీట్లలో ఎటువంటి దిద్దుబాట్లు లేకుండా చూసుకోవాలని స్పష్టం చేశారు. పని ప్రదేశాల వద్ద ఆయా పనులకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన నేమ్ బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి బి.లవరాజు, ఎపిడి శైలజ, హెచ్ఆర్ మేనేజర్ పి.శ్రావణ్ కుమార్, జెడ్‌పిటిసి గూడ ఎండయ్య, ఎంపిపి ప్రతినిధి బి.ఉదయ్ కుమార్, వైస్ ఎంపిపి ఎస్.ఆదినాయుడు ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎస్ఆర్‌పి రమణ, ఎపిఒ రవి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల ఆరోగ్య రక్షణకు చర్యలు

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి - ఆమదాలవలస

పారిశుధ్య కార్మికుల ఆరోగ్యానికి భరోసా కల్పించేలా ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మున్సిపాలిటీ పరిధిలో 80 మంది పారిశుధ్య కార్మికులకు వ్యక్తిగత ఆరోగ్య కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాలకు పరిరక్షకులుగా నిలుస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందన్నారు. గతంలో మున్సిపల్ శాఖ నుంచి అందజేసే ఆరోగ్య కిట్లను నిలిపివేయడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని కార్మికులు స్పీకర్ దృష్టికి తీసుకురాగా, ఉన్నతాధికారులతో మాట్లాడి అందజేసిన స్పీకర్‌కు కార్మికులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, వైస్ ఫ్లోర్ లీడర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, పొన్నాడ చిన్నారావు, దుంపల శ్యామలరావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కిట్లను అందజేస్తున్న స్పీకర్ సీతారాం

15కి జగనన్నకు చెబుదాం స్పందన వాయిదా

శ్రీకాకుళం : ఈనెల 13వ తేదీన టెక్కలి మండల ప్రధాన కేంద్రంలో నిర్వహించనున్న జగనన్నకు చెబుదాం మండల స్థాయి స్పందన కార్యక్రమం వాయిదా వేసినట్లు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 15వ తేదీన నిర్వహించనున్నట్లు తెలిపారు.

వినాయక మండపాలకు అనుమతులు తప్పనిసరి

ఎస్‌పి జి.ఆర్ రాధిక

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఈనెల 18న వినాయక చవితి సందర్భంగా వినాయకుని మండపాల ఏర్పాటు, ఉత్సవాల నిర్వహణకు సంబంధిత డిఎస్‌పి అనుమతి తప్పనిసరిగా పొందాలని ఎస్‌పి జి.ఆర్ రాధిక ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. వినాయక చవితి ఉత్సవాలను సక్రమంగా నిర్వహించేందుకు నిర్వాహకులు కింది నియమాలను పాటించాలని సూచించారు.

- మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు తప్పనిసరిగా సంబంధిత డిఎస్‌పి (సబ్ డివిజనల్ ఆఫీసర్) కార్యాలయంలో అనుమతులు తీసుకోవాలి.
- డిఎస్‌పి కార్యాలయంలో అనుమతులకు దరఖాస్తు పెట్టే ముందు దరఖాస్తుతో పాటుగా మున్సిపాల్టీ, పంచాయతీ, అగ్నిమాపక, ఎలక్ట్రిసిటీ తదితర విభాగాల అనుమతులు తప్పనిసరిగా జత చేయాలి.
- బలవంతపు చందాలు, వసూళ్లు గానీ దర్శనాల టిక్కెట్లు గానీ పెట్టరాదు. ఎవరైనా అటువంటి చర్యలకు పాల్పడితే వాటిపై ఫిర్యాదులు చేసేందుకు డయల్ 100కి ఫోన్ గానీ 6309990933 నంబరుకు పోలీసు వాట్సాప్ నంబరుకు సమాచారాన్ని అందించాలి.
- ప్రతి మండపానికి సంబంధిత పోలీస్‌స్టేషన్ నుంచి ఒక పోలీస్‌ను కో-ఆర్డినేటర్‌గా నియమించడం జరుగుతుంది.
- విగ్రహం ఎత్తు, బరువు, ఉత్సవాలు ఎన్ని రోజులు నిర్వహిస్తారు, నిమజ్జనం చేసే తేదీ, సమయం, నిమజ్జనం చేసే ప్రాంతం, వెళ్లే తోవను పోలీసులకు ముందుగా తెలపాలి.
- విద్యుత్ షార్ట్‌సర్క్యూట్, అగ్ని ప్రమాదాలు సంభవించకుండా నిర్వాహకులు ముందుజాగ్రత్తలు తీసుకోవాలి.
- శబ్ద కాలుష్యం నియంత్రిస్తూ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నియమాలైన పగటిపూట 55 డెసిబుల్స్, రాత్రిపూట 45 డెసిబుల్స్ దాటకుండా, బాక్స్ టైపు స్పీకర్లను మాత్రమే వినియోగించాలి.
- ఉదయం ఆరు నుంచి రాత్రి పది గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలి.
- కమిటీ సభ్యులు రాత్రి సమయంలో మండపం వద్ద తప్పనిసరిగా కాపలాగా ఉండాలి. నిర్వాహకులు సిసి టివిని తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.
- మండపాల వద్ద ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలి. విగ్రహాల దగ్గర వాహనాలు నిలపరాదు.
- ఊరేగింపు సమయములో అశ్లీల పాటలు, డాన్సులు చేసినా, మందుగుండు సామాన్లు, టపాసులు వాడినా చట్టరీత్యా చర్యలు తీసుకోబడును.
- నిమజ్జనం నిర్దేశించిన సమయంలో ఊరేగింపు ప్రారంభించి, నిర్ణీత సమయంలో నిర్దేశించిన ప్రాంతంలో మాత్రమే నిమజ్జనం చేయాలి. అనుమతి పొందిన ప్రదేశాల్లో తప్ప వేరే ఇతర ప్రదేశాల్లో నిమజ్జనం చేయరాదు.
- ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకల నిర్వహణకు నిర్వాహకులు తగిన జాగ్రత్తలు పాటించాలి.
- అనుమతులు ఉన్న స్థలంలో మండపాలు ఏర్పాటు చేసి ఆయా స్థలంలో ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలి.

ఆక్సిజన్ కాన్సంట్రేటర్లను అందజేస్తున్న స్పీకర్ సీతారాం

ఆక్సిజన్ కాన్సంట్రేటర్ల పంపిణీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య సేవలు గతం కంటే మెరుగుపడ్డాయని ఏపీ శాసనసభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. వైద్యులు తమ సేవలను విస్తృత పరిచినప్పుడే, సర్కారీ వైద్యశాలలలో ఓపీ సంఖ్య క్రమేపీ మెరుగుపడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలో మెట్టెక్కివలస, మెయిన్ రోడ్ వారి వీధి అర్బన్ హెల్త్ సెంటర్లకు తమ్మినేని ఇందుమతి, శ్రీరామ్మూర్తి ఛారిటబుల్ ట్రస్టు ద్వారా ఆక్సిజన్ కాన్సెంట్రేటర్లను సంస్థ మేనేజింగ్ ట్రస్టీ తమ్మినేని వాణి సీతారాం సమర్పించారు. వీటిని స్పీకర్ ఆయా వైద్యాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి సారథ్యంలో ముఖ్యంగా వైద్యరంగం కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన వెల్నెస్ సెంటర్లు,మొబైల్ వైద్యం ద్వారా ప్రాథమిక చికిత్స గ్రామాల్లో అందుబాటులోకి వచ్చాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవి సుధాకర్, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, వైస్ ఫ్లోర్ లీడర్ అల్లం శెట్టి ఉమామహేశ్వరరావు, పొన్నాడు చిన్నారావు, దుంపల శ్యామలరావు, చిరంజీవి, వైద్య, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపికలో పాల్గొన్న క్రీడాకారులు

నియోజకవర్గ స్థాయి క్రీడాకారుల ఎంపిక

ఇచ్ఛాపురం : స్థానిక సురంగి రాజా మైదానంలో మంగళవారం నియోజకవర్గ స్థాయి పాఠశాల క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ పోటీలకు నియోజకవర్గం నుంచి 320 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వాలీబాల్, టెన్నికాయిట్. యోగ, క్రీడాంశాల్లో ఎన్నికలు జరిగాయి. ఇందులో 87 మంది క్రీడాకారులు ఎంపికయ్యారు.. మిగిలిన క్రీడాంశాలు ఈ నెల 14,15,16 తేదీలలో రాజా వారి మైదానంలో జరుగుతాయని నియోజకవర్గ క్రీడా సమన్వయకర్త కె. పద్మనాభం రెడ్డి తెలిపారు. ఈ ఎంపికలో మండల విద్యా శాఖాధికారి అప్పారావు, వ్యాయామ ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని మంగళవారం ఐఎఎస్ విశ్రాంత ఉద్యోగి ప్రభాకర్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అనంతరం ఆలయంలో స్వామివారికి నిర్వహించే పలు సేవల్లో పాల్గొన్నారు. అనివేటి మండపంలో ఆయన స్వామివారి శేష వస్త్రాన్ని కప్పి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు మండవిల్లి రవి, ద్వారపు అనురాధ, జోగి మల్లెమ్మ, మైళపల్లి లక్ష్మి, ఆలయ సీనియర్ అసిస్టెంట్ కృష్ణమాచార్యులు పాల్గొన్నారు.

దమ్ము మడులను తలపిస్తున్న రోడ్లు

- అడుగు తీసి వేయలేని స్థితి
- పదేళ్లుగా ఇదే దుస్థితి
- పట్టించుకునే వారే కరువు

ప్రజాశక్తి- జి.సిగడాం

జి.సిగడాం మండలంలో పెంట-నాగులవలస, నిద్దాం-అద్దోనంపేట, టి.డి.వలస-సంతవురిటి గ్రామాలకు వెళ్లే అంతర్గత రహదారులు అధ్వాన్నస్థితిలో ఉన్నాయి. మండల కేంద్రం నుంచి పొగిరి మీదగా పెంట, నాగులవలస వెళ్లే రోడ్డుపై నడవాలంటే నరకయాతనే. పాలఖండ్యం నుంచి టి.డి.వలస వెళ్లాలంటే గోతులు దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రం నుంచి అద్దోనంపేట-నిద్దాం గ్రామాలకు వెళ్లాలంటే అవస్థలే.

అధ్వానంగా పెంట-నాగులవలస గ్రామాలకు వెళ్లే రహదారి

రాష్ట్ర విభజన తర్వాత ఈ రోడ్ల దుస్థితిని పట్టించుకునే వారే లేకుండా పోయారు. ఫలితంగా మండలంలో అనేక గ్రామాలు, వీధులకు వెళ్లే అంతర్గత రోడ్లన్నీ డ్రైనేజీలను చేరుకున్నాయి. రోడ్లపై పెద్ద గోతులేర్పడడంతో చిన్న చిన్న వర్షాలకే నిండిపోవడంతో దమ్ము పొలాలను తలపిస్తున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్లపై ఉన్న భారీ గోతుల్లో నీరు చేరి, చెరువులను తలపిస్తుండడంతో ఆయా చెరువుల్లోనే దిగి నడిచి వెళ్తున్నట్టు భావన కలుగుతోందని మండల వాసులు ఆవేదన చెందుతున్నారు. రోడ్ల దుస్థితిపై అధికారులు, పాలకులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా స్పందించే దిక్కులేదని మండల ప్రజలు వాపోతున్నారు. విభజన తర్వాత, టిడిపి, వైసిపి రెండు ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చినా ఏ ఒక్కరూ తమ గోడును పట్టించుకునే పరిస్థితి లేదంటున్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను రెండు ప్రభుత్వాలు పట్టించుకోలేదని, దీంతో గోతుల రోడ్లపై అవస్థలు పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. స్కూల్ వెళ్లే పిల్లలు సైకిల్‌పై వెళ్లి రాలేని పరిస్థితిలో ఉన్నామని వాపోయారు. విద్యార్థులు ఒక్కోసారి సైకిళ్లతో ఆయా గోతుల్లో పడి, లేచి వెళ్లాల్సి వస్తోంది.

పెంట గ్రామం వద్ద బురదలో కూరుకుపోయిన బైక్

ఇప్పటికైనా స్థానిక నాయకులు స్పందించి బిసి రోడ్లు వేయాలని కోరుతున్నారు.

హామీలే మిగిలాయి

ఎన్నికల వేళ రోడ్లు వేస్తాం... ఇతర సౌకర్యాలు కల్పిస్తాంమని ఇచ్చిన నేతల కనిపించడం లేదు. నడిచి వెళ్లేందుకూ వీలు లేనంతగా రోడ్లు పాడయ్యాయి. ఆస్పత్రికి, ఇతరత్రా అత్యవసర పరిస్థితుల్లో ఆటోలు, ఇతర వాహనాలు వచ్చే పరిస్థితి లేదు. అధికారులు, పాలకులు స్పందించి రోడ్లను బాగు చేయాలి. **- వి.సంతోష్ కుమార్, అద్దోనంపేట**

బైక్‌లను స్వాధీనం చేసుకున్న పోలీసులు

ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పరిసర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనాలను చోరీలు చేస్తూ పట్టుబడకుండా తప్పించుకుంటున్న దొంగలను పోలీసులు పట్టుకున్నారు. మంగళవారం సిఐ ఈశ్వరచంద్రప్రసాద్ సర్కిల్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణ పరిధిలోని సంతపేట గ్రామవాసి కర్రి నాగరాజుకు చెందిన కొత్త పల్సర్ బైక్ పది రోజులు కిందట చోరీకి గురైందని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దాంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తుండగా మంగళవారం కంచిలిలోని డి.జి.పురానికి చెందిన ఎం.శివ, గంగాధరపురానికి చెందిన జి.ప్రసాద్‌లు కంచిలి నుంచి ఇచ్ఛాపురానికి వస్తుండగా అనుమానంతో పట్టుకొని ప్రశ్నించారు. వీరిని విచారించగా ఆరు బైకులు దొంగలించినట్లు అంగీకరించారు. పట్టుబడిన బైకులు సీజ్ చేసి శివ, ప్రసాద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సిఐ తెలిపారు. పట్టుడిన బైకుల్లో పట్టణానికి చెందిన కర్రి నాగరాజుది ఒకటి, ఛత్రపుర్, నౌపడా, నరసన్నపేటకు చెందిన మూడు వాహనాలుగా గుర్తించామని అన్నారు. మరో రెండు బైకులు ఎవరివనేవి గుర్తించాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ కె.గోవిందరావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను మార్చాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

నియోజకవర్గంలో పోలింగ్ నిర్వహించనన్న కేంద్రాలు మరమ్మతులకు గురయ్యాయని, వేరే కేంద్రాలకు మార్చాలని తెలుగు దేశం పార్టీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణ మూర్తి ఎన్నికల అధికారి జయదేవిని కోరారు. మంగళవారం నరసన్నపేట తహశీల్దార్ కార్యాలయం లో ఎన్నికల అధికారి జయదేవి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో సుమారు 28 చోట్ల పోలింగ్ కేంద్రాలు మార్చాల్సిన పరిస్థితి ఉందని ప్రస్తావించగా. వాటిని పరిశీలిస్తామని తెలిపారు. పోలాకి మండలం పల్లిపేట పంచాయతీలో మెట్టపేట గ్రామ

సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల నాయకులు

ఓటర్లు గోవిందపురం వెళ్లవలసి వస్తోందని బిజెపి నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట ఎంపిపి ఆరంగి మరళి, సర్పంచ్ బి.శంకర్, పోలాకి తహశీల్దార్ శ్రీరాములు, నరసన్నపేట తహశీల్దార్ సింహాచలం, పోలాకి టిడిపి మండల అధ్యక్షుడు ఎం. వెంకట అప్పలనాయుడు, బిజెపి నాయకులు కరుకోల రామారావు, వై.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మోహనరావు

నగరంలోని బలగ కూడలి వద్ద ఉన్న ప్రభుత్వ డిఎల్‌టిసి, ఐటిఐలో టైలరింగ్‌పై ఉచితంగా శిక్షణ ఇస్తున్నా మని ఎడి వై.మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. 40 ఏళ్ల లోపు వయసు గల మహిళలకు టైలరింగ్ థియరీ, ఆధునిక మిషన్‌పై ప్రాక్టికల్‌గా శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. కనీస విద్యార్హత పదో తరగతి చదివిన వారు అర్హులన్నారు. ఏడాది కాలం పాటు ఈ శిక్షణ ఉంటుంద న్నారు. సూయింగ్ టెక్నాలజీ పేరుతో ధ్రువపత్రాలను అందజేస్తామన్నారు. ప్రవేశాల రిజిస్ట్రేషన్‌కు వెబ్‌సైట్ iti.ap.gov.inలో ఈనెల 19లోగా దరకాస్తు చేసుకో వాలని సూచించారు. 20న ఒరిజినల్ ధ్రువపత్రాలను పరిశీలిస్తామని అన్నారు. మరిన్ని వివరాలకు 8919623589, 9505161701 నంబర్లను సంప్రదించాలన్నారు.

కొత్తూరు ఎస్ఐగా అహ్మద్

అహమ్మద్, ఎస్ఐ

కొత్తూరు : కొత్తూరు ఎస్ఐగా ఎం.ఎ.అహ్మద్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. ఈయన ఆమదాలవలస ఎస్ఐగా పనిచేస్తూ... ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎస్ఐ ఎం.గోవింద్‌ను శ్రీకాకుళం విఆర్‌కు పంపించారు. ముందుగా పోలీస్ సిబ్బంది అహమ్మద్‌కు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు.

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సందడిగా ఫ్రెషర్స్ డే

కొత్తూరు : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళ వారం విద్యార్థినీ విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్ బండారు.రవి కుమార్ అధ్యక్షతన ఫ్రెషర్స్ డే కార్యక్రమం నిర్వహించారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కొత్తగా చేరిన ప్రథమ. సంవత్సరం విద్యార్థులను స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులు నత్యాలు. చేస్తూ తోటి విద్యార్థులను ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రథమ ప్రిన్సిపాల్ ఎద్దు గోపాల్‌దాస్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు చదువులో రాణించి కళాశాలకు, తల్లిదండ్రులకు, అధ్యాపకులు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ ఛైర్మన్ సారిపల్లి కష్ణ, వేణి,రిటైర్డ్ అధ్యాపకులు టి.ఆదినారాయణ, ప్రధానోపాధ్యాయులు ఎ. గోవిందరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

ఆదర్శప్రాయులు 'గరికిపాటి'

ప్రజాశక్తి- టెక్కలి

రచనలు, పాటలు ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చిన గరికిపాటి రాజారావు ఆదర్శప్రాయులని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు ఆన్నారు. రాజారావు 60వ వర్ధంతి సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం సభ నిర్వహించారు. ముందుగా ప్రజా నాట్యమండలి ఆధ్వర్యాన గరికిపాటి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళ కోసం ప్రజల కోసం అనే నినాదంతో ఆనేక నాటికలు, నాటకాలు, సినిమాలు ద్వారా సమాజంలో ఉన్న రుగ్మతలపై పోరాటం చేశారని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలవలస ధర్మారావు, జిల్లా కార్యదర్శి కురమాన దాలయ్య, తమ్మినేని వైకుంఠరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కొల్లి ఎల్లయ్య, ప్రజా నాట్యమండలి నిర్వాహకులు బగాది వాసుదేవరావు, విశ్రాంత ఉపాధ్యాయులు కోరాడ మోహనరావు, డొంకాన పాపారావు, ఎన్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న రోటరీ సభ్యులు

మహిళకు రక్తదానం

సోంపేట: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గొల్ల కంచిలి గ్రామానికి చెందిన వి గున్నమ్మకు అత్యవసరంగా బి పాజిటివ్ రక్తం అవసరం కాగా స్థానిక రోటరీ క్లబ్ ప్రతినిధులు రక్తం అందించారు. మహిళ పరిస్థితి తెలుసుకున్న రోటరీ సభ్యులు రక్తం అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు శ్రీనివాసరావు, కర్రి మిన్నారావు, వి. శివశంకర్ రావు, పి.గోవిందరావు పాల్గొన్నారు. అంతకుముందు రోటరీ క్లబ్ అభివద్ధికి స్థానిక సిఎస్ఆర్ షాప్ ఎండి చలపతి రూ.83 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

యోగా పోటీలకు 11 మంది ఎంపిక

పొందూరు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో లోలుగు ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన మండల స్థాయి యోగా పోటీల్లో తాడివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 11 మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు బల్ల కంటయ్య తెలిపారు. వాలీబాల్ పోటీల్లో ఇద్దరు విద్యార్థులు, షార్ట్ ఫుట్ పోటీల్లో ఒకరు నియోజకవర్గ పరిధిలో జరిగే పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వారిని ఉపాధ్యాయులు అభినందించారు. ఈ నెల 15వ తేదీ నుంచి ఆమదాలవలస పట్టణంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగనున్న పోటీల్లో వీరంతా పాల్గొంటారని తెలిపారు. వీరికి వ్యాయామ ఉపాధ్యాయులు పెంటయ్య, యోగా ఉపాధ్యాయులు మూల వెంకట రమణ, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

ఎంపికైన తాడివలస పాఠశాల విద్యార్థులు

కార్యకర్తలతో ఎమ్మెల్యే ఆత్మీయ కలయిక

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న కార్యకర్తలు

ప్రజాశక్తి- లావేరు

గ్రామ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కార్యకర్తలు పనిచేయాలని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని బుడతవలస పంచాయతీలో కార్యకర్తలతో ఆత్మీయ కలయిక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రతి కార్యకర్తనూ పేరుపేరునా పిలిచి ఆత్మీయంగా పలకరించి వారికి సమస్యలు ఏదైనా ఉంటే అక్కడికక్కడే పరిష్కరించేలా చొరవ తీసుకుంటున్నారు. గ్రామస్థాయిలోని సమస్యలు పరిష్కరించేందుకు అధికారులతో మాట్లాడి పరిష్కరించాలన్నారు. సోషల్ మీడియా, మాధ్యమాల్లో ఈ నాలుగేళ్లలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దన్నాన రాజినాయుడు, సర్పంచ్ రౌతు సురేంద్ర, రౌతు చిరంజీవి, రేవల్ల నాగేశ్వరరావు, కరిమజ్జి ప్రతాప్ పాల్గొన్నారు.

నాగం సోదరులకు పరామర్శ

మండలంలోని గుమ్మాడంకు చెందిన నాగం సోదరులు, సచివాలయం కన్వీనర్ నాగం కనకరాజుకు చెయ్యి విరిగింది. ఆయన సోదరుడు, వైసిపి కార్యకర్త నాగం రమేష్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్ గుమ్మాడం వెళ్లి ఇద్దరినీ పరామర్శించారు. ఈయన వెంట ఎంపిటిసి జగ్గారోతు తవిటినాయుడు, మాజీ సర్పంచ్ దుర్గశి, ధర్మరావు, ముప్పిడి అమర్నాథ్, నాగం వెంకటరమణ ఉన్నారు.

పలాస : మాట్లాడుతున్న గౌతు శిరీష

కక్షపూరితంగా చంద్రబాబు అరెస్టు

పలాస : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడును కక్షపూరితంగా అరెస్టుకు రంగం సిద్ధం చేసి దేశం వదిలి పారిపోయిన పిరికి పంద రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆరోపించారు. త్వరలో చంద్రబాబు నాయుడు బయటకు వస్తారని, అండగా రాష్ట్ర ప్రజలు ఉన్నారని చెప్పారు. పలాస టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గుజరాత్‌లో విజయవంతమైన స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇక్కడ యువతకు ఉపయోగపడుతుందని 2014లో తీసుకొచ్చారు. ఇందులో అవినీతి జరుగుంటే వైసిపి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లు ఏమి చేశారని ప్రశ్నించారు. ఈ విషయంలో అరెస్టు అయిన అచ్చెన్నాయుడును ఆధారాలు లేవని విడిచిపెట్టి... మళ్లీ అదే కేసులో చంద్రబాబును అరెస్టు చేయడం కక్ష సాధింపు కాదా అని ప్రశ్నించారు. ఆర్థిక శాఖ అప్పటి కార్యదర్శులు రమేష్, అజయ్ కల్లాం, ప్రేమచందర్ రెడ్డి వైసిపి ప్రభుత్వంలో పనిచేస్తున్నారని, వారిని విడిచిపెట్టి ఏ తప్పు చేయని చంద్రబాబును అరెస్టు చేయడం అక్రమం కాదా? అని ప్రశ్నించారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి విఠల్, గాలి కృష్ణ, సప్ప నవీన్, అంబటి కష్ణమూర్తి, దడియాల నరసింహులు, జానకి రావు, గురిటి సూర్యనారాయణ, రవిశంకర్ గుప్తా, డొక్కరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలన్న నిరంతర శ్రామికుడు నారా చంద్రబాబునాయుడు అని, అటువంటి వ్యక్తిని రాజకీయ దురుద్దేశ్యంతో తప్పుడు కేసులు ఆపాదించి అక్రమ పద్ధతిలో అరెస్టు చేశారని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ ఆరోపించారు. అరసవల్లిలోని ఆయన స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో కలిసి మంగళవారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రాన్ని ఎల్లప్పుడూ ముందు వరుసలో నిలపాలన్న లక్ష్యంతో పనిచేసిన ఆయనను దోషిగా చూపడం సరికాదన్నారు. సమాజంలో యువత జీవన విధానాన్ని మెరుగుపరచాలన్న లక్ష్యంతో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేసి అనేక మందికి నైపుణ్యాన్ని అందించారన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా పరిషత్ వైస్ చైర్పర్సన్ ప్రతినిధి పాలిన శ్రీనివాస రావు అన్నారు. మంగళ వారం పూండి బస్ స్టాండ్‌లో బస్ షెల్టర్‌కు ఆయన భూమి పూజ నిర్వహించారు. ప్రయాణికుల అవసరాల దష్ట్యా శిథిలమైన పాత షెల్టర్‌ని కూల్చివేసి కొత్తది నిర్మిస్తున్నట్లు తెలిపారు. సుమారు ఐదు లక్షల రూపాయలతో బస్ షెల్టర్ నిర్మిస్తున్నట్లు తెలిపారు. బస్ స్టాండ్ రహదారి అభివద్ధి చేశామని, త్వరలోనే రహదారికి ఇరువైపులా కొత్త డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తామని అన్నారు.

శంకుస్థాపన చేస్తున్న శ్రీనివాసరావు

మంత్రి అప్పలరాజు సహకారంతో పంచాయతీలో అభివద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాలిన చిరంజీవి గ్రామస్తులు కణితి వెంకట భగవాన్, మెట్ట వెంకట రావు, కొంచడ గోవింద రావు, సేనాపతి వెంకట రమణ పాల్గొన్నారు.

టిడిపి నాయకుల నిరసన

కోటబొమ్మాళి : విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు

కోటబొమ్మాళి: ప్రభుత్వం కావాలనే కక్షకట్టి చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయించి జైలకు పంపిచారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, మండల పార్టీ అధ్యక్షుడు బోయిన రమేష్‌లు అన్నారు. ఈ మేరకు స్థానిక పాతబస్టాండ్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద మంగళవారం ముఖాలకు నల్లబాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు నివాళ్లర్పించారు. కార్యక్రమంలో కోరాడ గోవిందరావు, బి.రంగనాథ్, బోయిన ద్వారక, జిల్లా నాయీబ్రహ్మణ ఉపాధ్యక్షులు నౌగాపు నాగరాజు పాల్గొన్నారు.

పలాస : చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ఆదేశాల మేరకు సిఐడి అధికారులు అక్రమంగా అరెస్టు చేశారని, దీనిని తీవ్రంగా ఖండించాలని అండమాన్ నికోబార్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎన్. మాణిక్యాలరావు, పార్టీ ఇన్చార్జి మాధవనాయుడులు అన్నారు. మంగళవారం చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా రిలే నిరహార దీక్ష చేపట్టారు. దీక్షలో పోర్టుబ్లెయర్ మున్సిపల్ చైర్మన్ ఎస్. సెల్వి, టీడీపీ కౌన్సిలర్ సాహుల్ హమీర్, అండమాన్ పార్టీ కార్యదర్శి కాంతారావు, ఉపాధ్యక్షులు జి.ప్రసాద్, టీడీపీ తిరుపతి నియోజకవర్గం ఇన్‌ఛార్జిలు సురేంద్రలు పాల్గొన్నారు.

మందస: ప్రభుత్వం అమలు చేస్తున్న రాజారెడ్డి రాజ్యాంగం నిజాయితీపరులను దోషులుగా ముద్ర వేసే ఆలోచనతో ముందుకు సాగుతోందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి దాసరి తాతారావు విమర్శించారు. మంగళవారం తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ అధినేత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్టును తీవ్రంగా ఖండించారు. సైకో జగన్మోహన్ రెడ్డి పైశాచిక చర్యల వల్ల ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిడెల్ క్యాస్ట్రో అన్నట్లు 'అవినీతిపరులను అందలం ఎక్కిస్తే నీతిమంతులను జైల్లో పెడతారు' నూటికి నూరు శాతం వైసీపీ పాలనలో ఇది నిజం అవుతోందన్నారు. రాజకీయ అవిశ్రాంత పోరాటంలో ఇది ఒక చిన్న విరామం మాత్రమేనని కార్యకర్తలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఈ పరిస్థితుల్లో లోకేష్ బాబుకి అందరం అండగా నిలవాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

సంక్షిప్త వార్తలు

167 మందికి నేత్ర వైద్య పరీక్షలు

కొత్తూరు : మండలంలోని లబ్బ గిరిజన ఆశ్రమ పాఠశాలలో మంగళవారం వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఆప్తాల్మిక్ వైద్యాధికారి ఇప్పిలి జానకి రామయ్య 167 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో ఏడుగురికి దష్టి లోపం ఉన్నట్లు గుర్తించారు. వీరికి కళ్ళద్దాలు పంపిణీ చేయనున్నారు. అలాగే పది మందికి సాధారణ జబ్బులుండడంతె వీరికి మందులు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు కాశీ విశ్వనాధం, వైద్య సిబ్బంది మౌనిక, విజయ, పి.పార్వతి పాల్గొన్నారు.

62 మందికి...

మెళియాపుట్టి: మండలంలోని పాత మారడికోట గ్రామంలో హెూం డాక్టర్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం చాపర పీహెచ్సీ వైద్యాధికారిని పావని ఆధ్వర్యంలో 62 మందికి వైద్య తనిఖీలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు ఇచ్చి తగు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కళ్యాణికి ఘన సన్మానం

రణస్థలం: రణస్థలం మండల కేంద్రం, బ్రహ్మణ వీధిలో ఉన్న కళ్యాణి కంటి ఆసుపత్రి పారామెడికల్ అప్తాల్మిక్ ఆఫీసర్ (విజన్ టెక్నీషియన్) ఎస్.కళ్యాణిని విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో ఫౌండేషన్ ప్రతినిధులు ఆత్మకూరి కష్ణకుమార్, ఆత్మకూరి విజయకుమార్, రాధాకష్ణన్ తదితరులు ఇటీవల ఘనంగా సన్మానించి జ్ఞాపిక అందజేశారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉచిత కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి మరెంతో మందికి ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేయిస్తానని పేర్కొన్నారు.

మాజీ స్పీకర్ సూర్యనారాయణ పాత్రో సంతాప సభ

పర్లాకిమిడి : గజపతి జిల్లా కాశీనగర్‌లో స్థానికులు మాజీ ఒడిశా స్పీకర్ సూర్యనారాయణ పాత్రో ఈ నెల 2న మృతి చెందడంతో మంగళవారం సంతాప సభ నిర్వహించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కాశీనగర్ ఎన్ఎసి ఉపాధ్యక్షులు రఘురాం సాహు, స్థానికులు కరిమి మధు, కర్ణం వెంకటరావు, రొక్కం కృష్ణారావు, కొవ్వాడ భాస్కరరావు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆమడదూరంలో సోమదాలవలస

ప్రజాశక్తి- బూర్జ

అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది ఆ గిరిజన గ్రామం. ఎటు చూసినా సమస్యలే. దరి చేరని పథకాలు. దిక్కుతోచని స్థితిలో గిరిజనులు ఉన్నారు. మారుమూల గ్రామాలు సైతం అభివృద్ధి చేస్తామని పాలకుల ప్రకటనలు ఈ గ్రామం వైపు కన్నెత్తైనా చూడటం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పి.ఎల్.దేవిపేట పంచాయతీ సోమదాలవలస గిరిజన గ్రామం సమస్యలతో సతమతమవుతోంది. సుమారు 300 మీటర్ దూరంలో ఉన్న ఈ గ్రామానికి


మూలకు చేరిన తాగునీటి కుళాయి

అధ్వానంగా ఉన్న రహదారి

చేరుకోవాలంటే సరైన రహదారి సౌకర్యం లేకపోవడం శోచనీయం. అత్యవసర సమయంలో 108, 104 వంటి వాహనాలు రావడానికి అవకాశం లేదని గిరిజనులు పేర్కొన్నారు. గ్రామంలో కాలువలు లేకపోవడంతో మురుగనీరు రోడ్లపైన ప్రవహిస్తుంది. ఇప్పుడో వేసిన సోలార్ లైట్లు మరమ్మతులకు గురికావడంతో రాత్రి సమయంలో గ్రామం అంధకారంలో ఉంటుంది. అప్పుడప్పుడు వచ్చే కుళాయి నీరే తమకు ఆధారమని తెలిపారు. గ్రామంలో సమస్యలు పేరుకుపోయాయని పాలకులకు, అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశామని, అయినా తమ గ్రామం వైపు ఎవరూ చూడటం లేదని వాపోయారు. గత, ప్రస్తుత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం శోచనీయమని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా తమ గ్రామానికి సౌకర్యమైన రహదారితో పాటు కాలువలు, తాగునీరు, విద్యుత్ సరఫరా వంటి సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.


మరమ్మతులకు గురైన సోలార్ లైట్

సమస్యలు పరిష్కరించాలి

తాగునీటికి అవస్థలు పడుతున్నాం. వేసిన కుళాయి, సోలార్ లైట్లు మరమ్మతులకు గురయ్యాయి. నాయకులు, అధికారులు తమ గ్రామానికి వచ్చిన ప్రతిసారీ విన్నవించుకుంటున్నాం. ఇప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. అధికారులు స్పందించి తాగునీటిని సరఫరా చేయాలి.

– పాలక రత్నాలమ్మ

అత్యవసర సమయంలో అవస్థలు

రహదారి సౌకర్యం లేదు. దీంతో అత్యవసర సమయంలో అవస్థలు తప్పడం లేదు. 108, 104 వాహనాలు రాలేని పరిస్థితి. సోలార్ లైట్లు మరమ్మతులకు గురికావడంతో రాత్రి వేళల్లో అంధకారంగా ఉంటుంది. దీంతో విషసర్పాల భయం పట్టుకుంది. అధికారులకు ఎన్నోసార్లు వివరించినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– ఢిల్లేశ్వరరావు, గ్రామస్తుడు